ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 2 మే 2024



అగ్రనేతల ప్రచారంపై దృష్టి 8

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం 8

కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు బాధపడుతున్నారు..

- బండి సంజయ్ గెలుపు కోసం ఆలస్యంగా అభ్యర్థి ప్రకటన - బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



చింతకుంట కార్నర్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి ఓట్లేసిన ప్రజలు నేడు మోసపోయి బాధపడుతున్నారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి కరీంనగర్ జిల్లా చింతకుంట కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ బండి సంజయ్ గెలుపు కోసం టికెట్‌ను ఆలస్యంగా ఇచ్చిందన్నారు. ప్రచారానికి వస్తే ఐదేళ్లలో చేసిన అభివృద్ధిపై బండి సంజయ్‌ను నిలదీయాలన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతోనే కరువు వచ్చిందన్నారు. మూడు నెలల కాలంలోనే కేసీఆర్ పాలన లేని లోటు కనిపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్నదాతలు సాగు నీరు, తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేసీఆర్ పదేళ్ల పరిపాలనలో తెలంగాణ సస్యశ్యామలంగా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నీరు లేక చెరువులన్నీ వట్టిపోయాయన్నారు. ప్రజల్లో కేసీఆర్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక 48 గంటలపాటు ప్రచారాన్ని నిలిపి వేయించారన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, కొత్తపల్లి మున్సిపల్ ఛైర్మన్‌రుద్ర రాజు, ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, వైస్ ఎంపీపీ తిరుపతినాయక్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ రెడ్డవేణి మధు, శ్రీనివాస్‌గౌడ్, జమీలుద్దీన్, సాబీర్‌పాష, జయప్రకాశ్‌రెడ్డి, గంగాధర చందు, రుద్ర రాధ పాల్గొన్నారు.

● **కార్మికులకు అండగా బీఆర్ఎస్ పార్టీ..**

కరీంనగర్ టౌన్: తెలంగాణ ఉద్యమంలో కార్మికుల పాత్ర మరువలేనిదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం మేడే సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో కార్మిక బీఆర్ఎస్ కార్మిక విభాగం ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమాల్లో పాల్గొని జెండాలను ఆవిష్కరించారు. కార్మికులకు స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ కార్మిక దినోత్సవమని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కట్టుబడి ఉందని, వారి హక్కుల కోసం పోరాడుతామన్నారు.



వినోద్‌కుమార్, గంగులకమలాకర్‌లను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్ఎస్‌నాయకులు

● **కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు**

కొడిమ్యాల: కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలో ఆయన కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ వారు చెప్పిన ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఊడుతుందో తెలియదన్నారు. రెండేళ్లకో సీఎం మారుతాడన్నారు. కొండగట్టు అభివృద్ధికి బండి సంజయ్ ఏమీ తీసుకరాలేదన్నారు. బీజేపీ మాటలు నమ్మి మోసపోతే ఇక్కడ రేవంత్‌రెడ్డి, ఢిల్లీలో నరేంద్రమోదీ హైదరాబాదును కేంద్ర పాలిత ప్రాంతం చేసెందుకు కుట్రలు చేస్తారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, రసమయి బాలకిషన్, జడ్పీటీసీ ప్రశాంతి పాల్గొన్నారు.

● **ప్రజల్లో ఉండే మనిషిని ఎన్నుకోండి..**

- బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి



తంగళ్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బోయినపల్లి మాధవి

తంగళ్ళపల్లి: పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల్లో ఉండే మనిషి బోయినపల్లి వినోద్ కుమార్ అని పార్లమెంట్ సభ్యునిగా ఎన్నుకోవాలని బీఆర్ఎస్ అభ్యర్థి సతీమణి డాక్టర్ బోయినపల్లి మాధవి కోరారు. బుధవారం తంగళ్ళపల్లి మండల కేంద్రంతో పాటు చీర్లవంచ, లక్ష్మీపూర్ గ్రామాల్లో టీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉండి బండి సంజయ్ నయా పైసా అభివృద్ధి చేయలేదన్నారు. ఒక్క గుడి, బడి మంజూరు చేయలేదన్నారు. రాజకీయాలకు అతీతంగా పని చేసి ప్రజానాయకుడిగా ప్రజలు ఆశీస్సులు అందుకుంటున్న బోయినపల్లి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. చీర్లవంచలో బీఆర్ఎస్వీ నాయకుడు జక్కుల నాగరాజు ఆధ్వర్యంలో కార్నర్ సమావేశం నిర్వహించిన అనంతరం లక్ష్మీపూర్, తంగళ్లపల్లిలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ, ఎంపీపీ పడిగెల మానసరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజబీంకర్ రాజన్న, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సరస్వతి, అంకారపు అనిత, కోడి అంతయ్య, జక్కుల నాగరాజు, మాజీ సర్పంచ్‌లు మహేష్, జవహర్ రెడ్డి, జక్కుల రవిందర్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొండల్ రావు, మాజీ సింగిల్ విండో ఛైర్మన్‌సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేక కేంద్రంపై విమర్శలు

- ఎన్ని డ్రామాలు ఆడినా బీఆర్ఎస్, కాంగ్రెస్ గెలవలేవు- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



కరీంనగర్‌లో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

భగత్‌నగర్, మే 1: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం విమర్శలుచేస్తున్నారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ గెలిస్తే సీఎం సీటు పోతుందనే భయంపట్టుకుందన్నారు. సీఎం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను బద్నాం చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రలో భాగమేనన్నారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న కాగ్రెస్ జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై జనం నిలదీస్తుంటే చర్చను పక్కదారి పట్టించేందుకే రిజర్వేషన్ల రద్దు అంటూ డ్రామాలాడుతున్నారన్నారు. ఎన్ని డ్రామాలాడినా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గెలవలేవన్నారు. ఆ పార్టీలు రెండో స్థానం కోసమే పోటీ పడాలన్నారు. కరీంనగర్‌లో దేవుడిని కొలిచే ప్రతి ఒక్కరూ ఈ నెల 13న ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని, పదేళ్ల అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇక్కడున్న మంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం 12 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చానన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసి పాదయాత్ర చేశానన్నారు. అన్ని వర్గాలకు అండగా నిలిచానన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ప్రజల కోసం ఏం చేశారని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీ కోసం నిధులు, ఆర్వోబీ కోసం 154 కోట్ల నిధులు తీసుకు వచ్చానన్నారు. పొన్నం, వినోద్‌కుమార్ ఎంపీలుగా ఉన్న సమయంలో జాతీయ రహదారుల విస్తరణకు నిధులు ఎందుకు తీసుకు రాలేదని ప్రశ్నించారు. పేదల పక్షాన, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, దళిత, గిరిజనుల కోసం కొట్లాడానన్నారు. ఆరు గ్యారెంటీలకు మోసపోయి ప్రజలు మీకు ఓట్లేస్తే అమలు చేయకుండా మోదీ గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదని హేళన చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామన్న మీరు గాడిద గుడ్డు ఇచ్చారా అని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వం లేక పోతే దేశం ముక్కలయ్యే ప్రమాదముందన్నారు.



కేంద్రమంత్రి మురుగన్, ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ భారీ గజమాల వేస్తున్న కార్యకర్తలు

● **రాజ్యాంగం భగవద్గీత అన్న మోదీ**

- కేంద్ర పరిశ్రమలు, మత్స్యశాఖ సహాయ మంత్రి మురుగన్

రాజ్యాంగాన్ని భగవద్గీతగా దేశ ప్రధాని మోదీ అభివర్ణించారని కేంద్ర పరిశ్రమలు, మత్స్యశాఖ సహాయ మంత్రి మురగన్ అన్నారు. బుధవారం రాత్రి కమాన్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను మార్చే ప్రసక్తి లేదని మోదీ స్పష్టం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో బండి సంజయ్ పాదయాత్రతో దేశమంతా చర్చ సాగిందన్నారు. ధైర్యంతో పనిచేసే బండి సంజయ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని, భవిష్యత్తులో ఆయన కేంద్ర మంత్రి అవుతారన్నారు.

● **దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం..**

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



పార్టీలో చేరిన నాయకులతో ఎంపీ బండిసంజయ్

వేములవాడ రూరల్: దేశ అభివృధి బీజేపీ తోనే సాధ్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. నాగాయపల్లి, పోశెట్టిపల్లి గ్రామాలలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కుల సంఘాలతో సమావేశమయ్యారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం, పార్టీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, బీజేపీ సీనియర్ నాయకుడు గోపు బాలరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సొంత గూటికి చేరుకున్న నాయకులు

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలో బీజేపీ పార్టీలో పని చేసిన పలువురు నాయకులు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరిన సిరిసిల్ల పట్టణ మాజీ అధ్యక్షుడు అన్నల్‌దాస్ వేణు, బీజేవైఎం జిల్లాప్రధాన కార్యదర్శి బూర విష్ణువర్దన్‌లతోపాటు పలువురు నాయకులు బుధవారం కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ సమక్షంతో తిరిగి బీజేపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలో చేర్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లిఖార్జున్, నాయకులు కోలా అంజనేయులు, చింతల్ ఠాణా నరేష్‌సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొన్న బైక్: యువకుడి మృతి



అభిలాష్(ఫైల్)

చందుర్తి, మే 1 : పోచమ్మ బోనాల పండుగకు అమ్మమ్మ ఇంటికి వచ్చిన యువకుడు బైక్‌పై వెళ్తూ కల్వర్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చందుర్తి మండలం జోగాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి జరి గింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన అభిలాష్(20) అనే యువకుడు చందుర్తి మండలం జోగాపూర్ అనుబంధ గ్రామమైన గుడిపేటలో బుధవారం పోచమ్మ బోనాల పండుగ సందర్భంగా అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. జోగాపూర్‌లో కిరాణం దుకాణానికి బైక్‌పై వెళుతుండగా కల్వర్టును ఢీకొన్నాడు. అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు.

నేడు మండలపరిషత్ సర్వసభ్య సమావేశం

ఇల్లంతకుంట, మే 1: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరుగుతుందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని, అన్ని గ్రామాల ఎంపీటీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు..

వాలీబాల్ ఉచిత క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

ముస్తాబాద్, మే 1: మండలంలోని ఆవునూర్‌లో ఉచిత వాలీబాల్ క్రీడా శిబిరాన్ని ప్రారంభించినట్లు పీఈటీ, కోచ్ తడుకల సురేశ్ పేర్కొన్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వ ర్యంలో ఉచిత వేసవి క్రీడా శిబిరాన్ని ఆవునూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 31వతేదీ వరకు వాలీబాల్ క్రీడా శిబిరం ఉంటుందని బాలబాలికలు క్యాంపును సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కోచ్ శంకర్, తల్లిదండ్రులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఆరెపల్లి మాజీ సర్పంచ్ రాజీనామా

వేములవాడ టౌన్, మే 1: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ సిలివేని మల్లేశం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలో కొనసాగిన మల్లేశం తన వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. తనతో పాటు గ్రామానికి చెందిన మరికొందరు బీఆర్ఎస్ పార్టీకి రాజీనావ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి జిజ్ఞాసలో మెరిసిన డిగ్రీ కళాశాల విద్యార్థులు



రాష్ట్ర స్థాయి ద్వితీయ బహుమతిని అందుకుంటున్న విద్యార్థులు

వేములవాడ టౌన్, మే 1 : కళాశాల విద్యాశాఖ ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుల పోటీల్లో వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ తెలిపారు. హైదరాబాద్‌లోని సోమాజిగూడ సంస్కృతి రాజ్ భవన్ కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్ర వెంకటేష్ చేతుల మీదుగా బుధవారం ప్రశంసపత్రంతో పాటుగా రూ. 21 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఆఫ్ రైతుబంధు స్కీమ్ ఆన్ ఫార్మర్స్ అనే అంశంపై విద్యార్థులు రూపొందించిన స్టడీ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవడం అభినందనీయమని, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిన కామర్స్ అధ్యాపకుడు మల్లారెడ్డి, విద్యార్థులు సుష్మ, లహరిక, రాజేష్, యశ్వంత్, అనిరుద్‌లను కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి



ఎన్నికల అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, మే 1: పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై సంపూర్ణ అవగహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిర్వర్తించాల్సిన బాధ్యతలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఓపీవోలకు సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు వేములవాడ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ రోజున ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు చేయాల్సిన విధులపై దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిర్ధేశించిన నియమ నిబంధనలపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీవోలు అవగాహన కలిగి ఉంటే నమ్మకంతో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు. పోలింగ్ జరిగే సమయంలో పోలింగ్ కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు , కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ల మధ్య కనెక్షన్ ఓటింగ్ కంపార్ట్మెంట్ రూపొందించడం ఓటరుగా గోప్యంగా తన ఓటు హక్కును వినియోగించేందుకు అవకాశం కల్పించడం వంటి ఏర్పాట్లపై ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఓపీవోలు తీసుకోవాల్సిన చర్యలు వారికి ఉన్న హక్కులు బాధ్యతలను సంపూర్ణంగా తెలుసుకొని ప్రతీ పోలింగ్ అధికారికి అవగహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్‌రోజు ఏమైనా సందేహాలు ఉన్నా, సమస్యలు ఎదురైనా సెక్టార్ అధికారులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, సీపీవో పీబీ శ్రీనివాసచారి, తహసీల్దార్‌లు షరీఫ్ మోహీనోద్దీన్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.


పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు..

సజావుగా పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ, వెబ్ క్యాస్టింగ్, తదితర అంశాల పై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ పార్లమెంట్ స్థానానికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య ఆధారంగా అవసరమైన అదనపు బ్యాలెట్ యూనిట్లు ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఈవీఎంలపై బ్యాలెట్ పత్రాల కమిషనింగ్‌కు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పారదర్శకంగా హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. మే 3 నుంచి 5 వరకు మొదటి విడత, మే 8న రెండో దశ హోం ఓటింగ్ పూర్తి చేయాలన్నారు.ప్రతి ఓటర్‌కు ఓటర్ సమాచార స్లిప్పు పంపిణీ అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో తుది ఓటరు జాబితా రూపొందించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల 88 వేల 153 మంది ఓటర్లకు (61 శాతం) ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 277 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, 197 పోలింగ్ కేంద్రాల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అన్నారు. సమావేశంలో ఆదనపు కలెక్టర్ పి గౌతమి, సిరిసిల్ల, ఆర్డీఓలు రమేష్, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, సీపీఓ శ్రీనివాసాచారి, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

శాంతియుత ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలి

- లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు - ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 1: శాంతియుతంగా ఎన్నికల నిర్వాహణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఎలాంటి లోటుపాట్లు జరగకుండా క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన భద్రత ఏర్పాట్లపై అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణతో పనిచేయాలన్నారు. ఎన్నికల్లో ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులతో పాటుగా విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డైనమిక్ చెక్ పోస్టులు ఏర్పాటుచేసి ముమ్మర తనిఖీలు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం, డబ్బు తరలించకుండా అడ్డుకట్ట వేయాలన్నారు. ఎన్నికల విధులకు సంబంధించిన నిర్దిష్టమైన సూచనలను తమ కింది స్థాయి సిబ్బందికి అందించాలన్నారు. అధికారులు, సిబ్బంది గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది తరుచు పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. ఎన్నికల విధులకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించే వ్యక్తుల మీద నిఘా వేసి ఉంచాలన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటర్లను ప్రలోభపరిచేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలుచేస్తూ అక్రమ మద్యం, నగదు పంపిణీలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియాపై దృష్టి పెట్టాలన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రజలను తప్పుదోవ పట్టించేలా వచ్చే ప్రకటనలు, ఫొటోలు షేర్‌చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, మురళీకృష్ణ, సర్వర్, సీఐలు రఘుపతి, సదన్‌కుమార్, శ్రీనివాస్, వీరప్రతాప్, వెంకటేశ్వర్లు, అనిల్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, మధుకర్, ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేశ్, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల నేతన్నలకు మెరుగైన ప్రణాళిక

- మంత్రి పొన్నం ప్రభాకర్

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి)/సిరిసిల్ల టౌన్/వేములవాడ/వేములవాడ టౌన్/కోనరావుపేట/వేములవాడ రూరల్: ఎన్నికల కోడ్ అయిపోగానే సిరిసిల్ల నేత కార్మికులకు గత పది సంవత్సరాలుగా ఇచ్చిన ప్రణాళిక కన్నా మంచి ప్రణాళిక అమలు చేస్తామని ప్రతి కార్మికుడు ఆర్థికంగా ఎదిగేలా చేస్తామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమను కాపాడుకోవడం కాదు భవిష్యత్తులో సిరిసిల్ల రికగ్నైజ్‌డ్ బ్రాండ్ క్రియేట్ చేస్తామని అన్నారు. 3వ తేదిన ముఖ్యమంత్రి సిరిసిల్లకు వస్తున్నారని ఈ ప్రాంత సమస్యలపై వారికి అవగాహన ఉందని అన్నారు. సిరిసిల్ల సభను విజయవంతం చేయాలని అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ప్రపంచ కార్మిక దినోత్సవంను బుధవారం కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి పాదయాత్ర చేశారు. వేములవాడ లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఐదేళ్ల కాలంలో పార్లమెంటు సభ్యుడి హోదాలో బండి సంజయ్ ఏఏ అభివృద్ధి పనులు చేశారో వేములవాడ రాజన్నపై ఒట్టేసి చెప్పాలని డిమాండ్ చేశారు. కోనారావుపేట, వేములవాడ మండలం అనుపురం, వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లిలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మంత్రి పొన్నం కార్నర్ మీటింగ్ నిర్వహించారు. తిప్పాపూర్ మాజీ సర్పంచ్ దుర్గం పర్శరాములు, ఆరెపల్లి మాజీ సర్పంచ్‌లు ఇటిక్యాల నవీనరాజు, సిలివేని మల్లేశం కాంగ్రెస్‌లో చేరారు.

ఎస్సారార్‌లో బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రదానం

గణేశ్‌నగర్, మే 1: ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ జయంతి అసోసియేట్ ప్రొఫెసర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ శాతవాహన యూనివర్సిటీ ముఖ్య అతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సౌందర్యం యొక్క ఆవశ్యకతను పరిగణలో ఉంచుకొని ఈ కోర్సులో వారు నేర్చుకున్నటువంటి అంశాలను సద్వినియోగపరచుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ కోర్సును ఉద్దేశించి గత 10 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్నటువంటి ఈ కోర్సు ఎంతో మందికి ఉపాధిని కల్పించిందని మీరు కూడా అదే దిశగా నడక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి శ్రీమతి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ఇంతటి గొప్ప విలువైన విద్యను నేర్పిన కళాశాలను విద్యార్థులను కోఆర్డినేటర్, రిసోర్స్‌పర్సన్ లీనాను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేసిక్ బ్యూటిషన్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మన్నే శోభారాణి మాట్లాడుతూ బేసిక్ బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించిన ప్రతి విషయం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కామరాజు, లెక్చరర్స్ సోనియారెడ్డి, డాక్టర్ ప్రమీల,జూబ్లీ రెప్లిక, కోర్సు రిసోర్స్ పర్సన్ లీనా, కోర్సుకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభవన్ శిక్షణ శిబిరానికి స్పందన


నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్, మే 1: జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి యేటా 5 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలకు వేసవిలో నిర్వహించే శిక్షణా శిబిరం అంబేద్కర్ స్టేడియంలో జరుగుతోంది. శిబిరానికి చిన్నారుల నుంచి మంచి స్పందన వస్తోంది. చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటింగ్స్, హాండ్ రైటింగ్, గాత్ర, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, మృదంగం, తబల, కంజీర, జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహం దీ కోర్సులతో పాటు అబాకస్, చెస్, శాస్త్రీయ నృత్యం, యోగాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. జూన్ 8వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. పాత, కొత్త విద్యార్థులు కలిపి ప్రస్తుతం (ఏప్రిల్ 30వ తేదీ వరకు) 330 మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. బాలబాలికలు ఆధార్ కార్డ్, ఫొటోతో సంప్రదించాలని కోరారు. ఈ మాసంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నా రు. శిక్షణకు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్, డీఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, వాటర్ బాటిల్స్, స్నాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్


ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే1: ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 28,29,30 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన జీఎస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి క్యాడెట్ విభాగంలో చైత్ర కాంస్య పతకం, బాలికల విభాగంలో అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్యలు రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు. అలాగే ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్, అవని రెడ్డి, రజిత పతకాలను సాధించారు. బాలుర విభాగంలో అజయ్, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని, పురుషుల డబుల్స్‌లో అజయ్, చన్మయ్ రజత పతకాలను సాధించి ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించి పెట్టారని జీఎస్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ జి శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జీఎస్ అకాడమీ ఉపాధ్యక్షుడు బి.శ్రీదర్ గౌడ్, బి మహేష్, యన్ మహిపాల్, సంయుక్త కార్యదర్శి వికాస్ కుమార్, కోశాధికారి గౌతంరెడ్డి, సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, శ్రీకరచారి, సంతోష్, హర్ష అభినందించారు.

కోడలిని దారుణంగా హత్య చేసిన మామ


ఆకుల మౌనిక(ఫైల్)

సారంగాపూర్, మే1: మండలంలోని రేచపల్లి గ్రామంలో కోడలిని గొంతు కోసి మామ హత్యచేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ అరీఫ్ అలీఖాన్ వెల్లడించారు. రేచపల్లి గ్రామానికి చెందిన ఆకుల మౌనిక (25)ను కొత్తపల్లి లచ్చునాయక్ తండాకు చెందిన ఆకుల తిరుపతితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. తిరుపతి జీవనోపాధి నిమిత్తం న్యూజిలాండ్ వెళ్లాడు. ఈ నెల 27న ఇద్దరు వ్యక్తులు మౌనిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశారు. దీంతో మౌనిక వేధింపులు తాళలేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదైంది. అయితే మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో తమ కుటుంబ పరువు పోయిందని మామ ఆకుల రాజిరెడ్డి కోడలిని మందలించాడు. ఇదే విషయమై ఆమెపై రాజిరెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మౌనిక ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట పడుకున్న మామ రాజిరెడ్డి పథకం ప్రకారం ఉదయం 5 గంటల సమయంలో కత్తితో మౌనిక గొంతు కోసి హత్య చేశాడు. దీంతో మౌనిక అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రి తోట రాజయ్య ఫిర్యాదు మేరకు మామ రాజిరెడ్డి, అత్త గంగవ్వ, భర్త తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగ బాలుడి మృతి

రామడుగు, మే 1: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కళ్లెం యశ్వంత్ (5) అనే దివ్యాంగ బాలుడు బుధవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కళ్లెం అంజయ్య, పుష్ప దంపతుల కుమారుడు యశ్వంత్ పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడి కోసం దంపతులు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందిగా ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా ఆస్తులను అప్పగించే అధికారం లేదు

● కొండగట్టు అధికారులకు విన్నవించిన సిద్దిపేట జిల్లా వాసులు ● గతంలో 2.20 ఎకరాలు దానం చేస్తానని ప్రకటించిన భక్తుడు

మల్యాల, మే 1: మా ఆస్తులను కొండగట్టు ఆలయానికి దానం చేస్తానని ప్రకటించిన తమ తండ్రి మాటలను పరిగణలోకి తీసుకోవద్దని సిద్దిపేట జిల్లాకు చెందిన కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులకు విన్నవించారు. తన కొడుకు తనను సాకడం లేదని తన ఆస్తిని కొండగట్టు అంజనేయస్వామికి దానం చేయడానికి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన కొప్పెర బాపురెడ్డి గత నెల 24న ఆలయానికి వచ్చాడు. ఆస్తి పత్రాలను హుండీలో వేయడానికి ప్రయత్నించాడు. గమనించిన అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులను కలిసారు. ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక తన భర్త తమ ఆస్తులను కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి దానం చేస్తానని తెలిపాడని బాపురెడ్డి భార్య లక్ష్మి, కుటుంబ సభ్యులు దేవస్థానం అధికారులకు తెలిపారు. ఈ మేరకు అతడి భార్య లక్ష్మి, కుమారుడు ప్రవీణ్‌కుమార్, కూతుళ్లు మల్లీశ్వరి, స్వరూప ఈవో చంద్రశేఖర్‌కు భూదానంపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య పరిస్థితి సరిగా లేని బాపురెడ్డి తమ కుటుంబ ఆస్తులను దానం చేస్తానని ఇటీవల కొండగట్టుకు వచ్చి ప్రచారం చేయడాన్ని పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆ ఆస్తులు తమకు మాత్రమే సంక్రమిస్తాయని అతడికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. దీనిపై దేవస్థానం అధికారులు తమను సంప్రదించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. బాపురెడ్డి 2.20 ఎకరాలకు సంబంధించిన పత్రాలు తదితరవి హుండీలో వేయాలని ప్రయత్నించాడు.


కొండగట్టు ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కటుంబ సభ్యులు

హుండీలలో వేస్తే ప్రయోజనం లేదని అధికారులు తెలుపగా దేవాలయం పక్కన రామాలయం నిర్మిస్తే ఆ భూమిని దానం చేస్తానని బాపురెడ్డి బాండ్‌పేపర్ రాసిచ్చాడు. పాసుపుస్తకం అందించగా దేవస్థానం అధికారులు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం వచ్చి బాపురెడ్డి తమతో 15ఏళ్లుగా ఉండడం లేదని భూమి దానంకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు.

మంథని సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్


ఫీడర్ బ్రేకర్ వద్ద మంటలు

మంథని, మే 1: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో మండలంలోని కాకర్లపల్లి ఫీడర్ సిటీ బ్లాస్ట్ కావడంతో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ ఫైరింగ్ కావడంతో మంథని టౌన్‌తో పాటు కాకర్లపల్లి సూరయ్యపల్లి, గంగాపురి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంలో వెంటనే స్పందించిన పెద్దపల్లి ఎస్సీ బొంకూర్ సుదర్శన్ సబ్‌స్టేషన్ సందర్శించి మంథని డీఈ ఈశ్వర ప్రసాద్, ఏఈ చిన్నాల మల్లయ్యలతో పరిస్థితిని సమీక్షించారు. ఉదయం 10 గంటలకు బ్లాస్టింగ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగగా ఎస్సీ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి 11 గంటలకు సరఫరా చేశారు. ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్ కావడంతో ఫైర్‌స్టేషన్ అధికారి సదానందం తమ సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

చేపలు పట్టడంపై రెండు గ్రామాల మధ్య వివాదం

మల్యాల,మే1: మండలంలోని పోతారం చెరువులో చేపలు పట్టడంపై పోతారం, గొల్లపల్లి గ్రామ వాసుల మధ్య గత రెండు రోజులుగా వివాదం నెలకొంది. మంగళవారం పోతారం చెరువులో చేపలు పట్టగా పోతారానికి చెందిన కొందరు లాక్కెళ్లినట్లు గొల్లపల్లికి చెందిన గంగపుత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోతారానికి చెందిన వాల్మికి భోయ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఇరు గ్రామాల వాదనలు విన్న పోలీసులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివాదంను అధికారులు పరిష్కరించాలని ఇరు గ్రామాల మధ్య గొడవలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 1: కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట, చెర్ల బూత్కూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 603 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ డేవిడ్ రవికాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావుల ఆదేశాలు మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు అధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఫకీర్‌పేటకు చెందిన అడపా వంశీ, మనకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన తప్పేట నితీష్‌కుమార్‌లను అరెస్టు చేయగా కరీంనగర్ కాశ్మీర్ గడ్డకు చెందిన ఎండీ ఉమర్ అలియాస్ నోమన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్దనుంచి 603 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. చర్లభుత్కూర్ గ్రామంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించామని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్, వర్మ, జీవన్, ట్రైనీ కానిస్టేబులు పాల్గొన్నారు.


నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ నాగేశ్వరరావు

కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాముల పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2జీ, సహారా, బొగ్గు, ఈఎస్ఐ స్కాంలతో దేశాన్ని భ్రష్టుపట్టించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. ఓ ట్రావెల్స్ అధినేత నుంచి కోటిన్నర విలువైన కారు, ఎన్టీపీసీ బూడిద తీసుకెళ్లే లారీలను ఆపి కాంట్రాక్టర్‌ను బెదిరించి మొదట రెండు కోట్లు, ఆ తర్వాత 6 కోట్లు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చినందుకు వెలిచాల రాజేందర్‌రావు వద్ద కోట్లాది రూపాయలు డబ్బులు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం అవినీతి, వ్యవహార శైలి చూస్తుంటే కాంగ్రెస్ నేతలే అసహ్యించు కుంటున్నారన్నారు. నాటి మంత్రి గంగులతో లాలూచీ పడి 5 కోట్లు తీసుకుని హుస్నాబాద్‌కు పారిపోయాడన్నారు. జర్నలిస్టులకు బీపీఎల్ కోటా కింద ఇచ్చిన భూములపై కన్నేసి లేని వివాదాన్ని సృష్టించిన మాట నిజం కాదా అన్నారు. బూడిద స్కాంపై అవసరమైతే సీబీఐకి లేఖ రాస్తామన్నారు. రిజర్వేషన్లపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న నీచమైన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ మాట్లాడుతూ 54 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రిజర్వేషన్లకు తూట్లు పొడి చిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించ డంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

చెరువులో పడి ఒకరి మృతి

గంగాధర, మే 1: గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన తూర్పటి మైసయ్య(27), అతని బావ పత్తి ముత్యాలు ఇద్దరు గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం వెల్లారు. ఇద్దరు చెరువు కట్టపై మద్యం సేవించిన అనంతర తూర్పటి మైసయ్య చేపల కోసం చెరువులోకి దిగాడు. మద్యం మత్తులో చెరువులోకి దిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి చెల్లె గంగ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం

సుల్తానాబాద్, మే 1: ఓ కుటుంబం కారులో దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. సింగరేణి అండ్రియాల ప్రాజెక్టులో పని చేస్తున్న ఓ కార్మికుడి కుటుంబం మొక్కు చెల్లించడానికి ఏప్రిల్ 27 తిరుమలకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారి వద్ద ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు ముందు టైర్ పేలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రాజీవ్ రహదారిపై ఘటన జరుగడంతో కారులో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు.

అక్కా చెల్లెళ్ల అదృశ్యం

మల్యాల,మే 1: మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ఓబులాపూర్‌కు చెందిన బొజ్జ బాబు భార్య లక్ష్మి గత 25 రోజుల క్రితం మృతి చెందగా కూతుళ్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లతో బాబు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మేడపైన ముగ్గురు పడుకోగా బాత్రూంకు వెళ్లి వస్తామని చెప్పి కిందకు దిగిన అక్కాచెల్లెళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో తండ్రి చుట్టు పక్కల ఇళ్లు, పలు చోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 1: ప్రేమ విఫలం అవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, యువకుడి బంధువుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ సజన్ (23) గత కొంతకాలంగా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని పెట్రోల్ బంక్ పక్కన తాత్కలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ఓ అమ్మాయి ప్రేమలో పడగా అది విఫలం అవడంతో ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యు లు అడ్డుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి మనోవేద నకు గురవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతోతీవ్ర మనస్థాపానికి గురై పంక్చర్ నిర్వహించే షెడ్డులో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సమీప బంధువులు పెద్దూర్ గ్రామానికి చెందిన సమీర్ పోలీసులకు మృతుని వివరాలను, ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

మల్యాల, మే 1: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ లారీ ఇంట్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వస్తున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కన గల బక్కశెట్టి పెద్ద గంగారాం అనే వ్యక్తి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పగా ఇంటి ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

పంట పొలాల్లో చెలరేగిన మంటలు


మండలను ఆర్పుతున్న రైతులు, పోలీసులు

సుల్తానాబాద్ మే 1: ధాన్యం లోడ్‌తో వస్తున్న ఓ లారీ తాకడంతో విద్యుత్ వైర్లు తెగి పంటపొలాల్లో పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి పంట పొలాలు అగ్నికి ఆహుతయ్యాయి. కదంబాపూర్ నుంచి ధాన్యం బస్తాల లోడ్‌తో రైల్వే ట్రాక్ వెంట వస్తున్న ఓ లారీకి పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దాంతో తీగలు పొలాలపై పడిపోయి మంటలు అంటుకున్నాయి. దాదాపు పది ఎకరాల్లో మంటలు అంటుకుని లక్ష రూపాయల వరకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులతో కలిసి మంటలను ఆర్పడంలో సహకరించారు. పెద్దపల్లి నుంచి వచ్చిన ఫైరింజన్ మొరాయించడంతో సిబ్బంది కూడా పోలీసులు, రైతులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


రంగు తిరుపతి (ఫైల్)

ఇల్లందకుంట, మే 1: మండల కేంద్రానికి చెందిన రంగు తిరుపతి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట గ్రామానికి చెందిన రంగు తిరుపతి, కవిత దంపతులకు ఇరువురు సంతానం ఉన్నారు. ఇరువురి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన తిరుపతి మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూతురు రంగు కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ పేర్కొన్నారు.

బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష రుసుం గడువు 7 వరకు

గణేశ్‌నగర్,మే1: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 7వ తేదీ వరకు తుది గడువు అని, 300/- ల అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మెట్‌పల్లి, మే 1: పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూక్య భూమయ్య(55) అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన భూక్య భూమయ్య పనుల నిమిత్తం మెట్‌పల్లికి వచ్చాడు. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు నిజామా బాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి భూమయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చరమగీతం పాడాలి

వీర్నపల్లి, మే 1: పేద ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. అనంతరం భూక్యతండా గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, ఉపాధ్యక్షుడు శివరామకృష్ణ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్ పాల్గొన్నారు.

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలి

చందుర్తి, మే 1: కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేష్ అన్నారు. చందుర్తి మండలం మల్యాల, గోస్కులపల్లి గ్రామాల్లో బుధవారం బీజేపీ నాయకులు ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు లోకోజు సతీష్, పతిపాక శ్రీనివాస్, పత్తిపాక దివ్యసాగర్, నరేష్, బద్దం తిరుమల్ రెడ్డి, గోస్కుల కమలాకర్, నక్క రమేష్, లంబ రాకేష్ పాల్గొన్నారు.

వీర్నపల్లి: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని జిల్లా దిశా కమిటీ సభ్యుడు బట్టు పీర్యా అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు ఇంటింటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. బూత్ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు గుగులోతు విజయ్, ముడావత్ సాగర్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటేసి మరోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేయాలని ఆ పార్టీ మండల ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, బాకురుపల్లితండా, గుండారం గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశంగుప్తా, బుగ్గారెడ్డి, దేవేందర్‌రెడ్డి, గణేశ్, శ్రీశైలం, బాపురెడ్డి, రవి, రామచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీకి ఓట్లు అడిగే హక్కులేదు

ఇల్లంతకుంట, మే 1: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం అనంతారం, పెద్దలింగాపూర్, దాచారం గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత వాగ్ధానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ మరోసారి మోసం చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేయాలని బీజేపీ చూస్తుందన్నారు. సమస్యలపై అవగాహన ఉన్న, ప్రశ్నించే గొంతుక అయిన వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, సెస్‌డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ చింతపల్లి వేణురావు, ఎంపీటీసీ బర్ల తిరుపతి, మాజీ సర్పంచులు గొడిశెల జితేందర్‌గౌడ్, పర్శరాం పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్, పొన్నాలపల్లె, లింగన్నపేట గ్రామాల్లో నాఫ్‌స్కాప్ చైర్మెన్ కొండూరు రవీందర్‌రావు బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాది హామీ కూలీల పనుల వద్దకు వెళ్ళి బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తరఫున ఎన్నికల ప్రచారం చేపట్టారు. కరీంనర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఉపాది కూలీలను అభ్యర్థించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణ్మారావు, నాయకులు దయాకర్‌రావు, సురెందర్‌రెడ్డి, లక్ష్మన్, బండ రమేష్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: భారత రాష్ట్ర సమితి ద్వారానే తెలంగాణాలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు ఎద్దండి నర్సింహరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని యాదవ, కుర్మ, రెడ్డి, ఉపాధీ కులీ, ప్రధాన రహదారికి ఇరుపక్కల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాచమడుగు సంతోష్‌రావు, ఎండీ సర్వర్‌పాషా, చెవుల మల్లేశ్, గుర్రాల రమేశ్‌రెడ్డి, శీలం స్వామి, నల్ల నర్సయ్య, దొరగొల్ల బాలయ్య పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి అభివృద్ధికి పట్టం కట్టాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, గుంటపల్లిచెరువుతండా, తిమ్మాపూర్, పదిర, వెంకటాపూర్, నారాయణపూర్, తదితర గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి ప్రజలు అరిగోసలు పడుతున్నారని జడ్పీటీసీ మ్యాకల రవి అన్నారు. వేములవాడ మండలం సంకెపల్లి, మారుపాకలో ఎంపీపీ బూర వజ్రవ్వబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. నాయకులు పెరుగు ఎల్లయ్య, జింక శ్రీధర్, రెడ్డవేని పర్శరాములు, పండుగు శంకర్, బాలయ్య, ఎరవేని మహేష్, బుచ్చయ్య, జింక శ్రీధర్ ఉన్నారు.

అగ్రనేతల ప్రచారంపై దృష్టి

- రేపు సిరిసిల్లలో సీఎం రేవంత్ జన జాతర సభ
- 8న వేములవాడలో మోదీ విశాల్ జన సభ
- 10న సిరిసిల్లలో కేసీఆర్ బస్సు యాత్ర
- జిల్లాలో పాదయాత్రలు, కార్నర్ మీటింగ్‌ల హోరు



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పార్లమెంట్ ఎన్నికల ప్రచారం గడువు మరో పది రోజులే ఉండడంతో ప్రధాన పార్టీలు అగ్రనేతలతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ జనసమీకరణతో సభలు నిర్వహించి ఓటర్లను తమవైపు మలుపుకునే దిశగా ప్రచార జోరును ముమ్మరం చేశారు. ఈ నెల 3న కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపుకోసం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం 2.30 గంటలకు జన జాతర సభకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారు. సభను విజయవంతం చేసే దిశగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి పెట్టారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాలో కార్నర్ మీటింగ్‌లతో పాటు ముఖ్య నాయకులతో సమావేశమై జన సమీకరణపై దృష్టి పెట్టారు. సిరిసిల్ల బైపాస్ రోడ్డులో స్థల పరిశీలన చేశారు.

బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ గెలుపు కోసం తొలిసారిగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ విశాల్‌జనసభను వేములవాడలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 8వ తేదీన ఉదయం పది గంటలకు వేములవాడకు ప్రధాన మంత్రి చేరుకోని ముందుగా రాజరాజేశ్వరస్వామిని దర్శించుకొని ఎన్నికల ప్రసంగించనున్నారు. ప్రధానమంత్రి బహిరంగ సభను విజయవంతం చేసే దిశగా బండి సంజయ్ సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లోని ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. సభ స్థలాలను పరిశీలించారు.



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్ (ఫైల్)

లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు సాధించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ క్షేత్రస్థాయిలో ప్రచారం వైపు దృష్టి పెట్టింది. స్వయంగా కేసీఆర్ రోడ్ షోలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 10న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రోడ్‌షో కేసీఆర్ నిర్వహించనున్నారు. ఇందుకోసం సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు రెండు నియోజకవర్గాల్లో క్లస్టర్ స్థాయి సమావేశాలను నిర్వహించారు. అగ్రనేతల ప్రచారం సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో ఆయా పార్టీల నాయకుల్లో ఉత్సాహాన్ని నింపుతుందని భావిస్తున్నారు.



సిరిసిల్లలో సీఎం సభ స్థలం పరిశీలనలో నాయకులు



వేములవాడలో పీఎం మోదీ విశాల్ జన సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ బండి సంజయ్, నాయకులు

● ఎండలతోనే బెంబేలు

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో అగ్రనేతల బహిరంగ సభలకు జన సమీకరణకు ఎండలతోనే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు బెంబేలేత్తుతున్నారు. వారిని తరలించడానికి, వచ్చిన వారికి సౌకర్యాలు కల్పించడం వంటి అంశాలపై ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 44 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో అయా పార్టీల ముఖ్య నాయకులే సభలకు రావడానికి ఇబ్బందులు పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

క్రీడలతో మానసికోల్లాసం

- నెల రోజులు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మే 1: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ప్రధానమన్నారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట ప్రాంతాల్లో నెల రోజుల పాటు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిక్షణ శిబిరాలలో కబడ్డీ, వాలీబాల్, అర్చరీ, యోగ, క్రికెట్, కరాటే, మార్షల్ ఆర్ట్స్, తదితర కీరడాలతో పాటుగా పోలీస్‌శాఖకు సంబంధించిన శిక్షణపై, పోలీస్ శాఖ అమలుపరుస్తున్న అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కీడల వలన శారీరక ధృడత్వంతో పాటు ఒత్తిడి దూరం చేయడానికి దోహదపడుతుందన్నారు. నిజ జీవితంలో సమిష్టి కృషితోనే విజయాలనుసులువుగా చేరుకోగలమనే దానికి క్రీడలు ఉదాహరణ అన్నారు. క్రీడాకారులు ప్రతి ఒక్కరు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఈ వేసవి ఉచిత క్రీడా శిక్షణ శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యకరమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సీఐ రఘుపతి, రూరల్ సీఐ సదన్‌కుమార్, ట్రాఫిక్ ఎస్ రమేశ్, వివిధ క్రీడల కోచ్‌లు పాల్గొన్నారు.

వేములవాడ: వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని, వ్యాయాయమే ఆరోగ్యానికి మందు లాంటిదని వేములవాడ డీఎస్పీ కె నాగేంద్ర చారి అన్నారు. 14 సంవత్సరాల లోపు చిన్నారుల కోసం పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడల శిక్షణ శిబిరాన్ని వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా



వేములవాడలో ఉచిత క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగేంద్రచారి



విలువిద్యను ప్రదర్శిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ వేసవికాలం కావడంతో ప్రతి ఒక్కరూ ఇంట్లో ఫోన్, టీవీలకు అతుక్కుపోయే అవకాశం ఉంటుందన్నారు. చిన్నారుల్లో ఆటలపై ఉత్సాహన్ని, ఉత్తేజాన్ని నింపేందుకు ఉచిత శిక్షణ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనేక రకాల క్రీడలలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, ఎస్సైలు అంజయ్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు వివిధ క్రీడల్లో ఉచిత శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో కష్టపడినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడలపై ఉచిత శిక్షణ ఇస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా వివిధ క్రీడా విభాగాల్లో శిక్షణ అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమాకాంత్, పీఈటీలు, పోలీసులు, 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయించిన వ్యక్తిపై కేసు

గంభీరావుపేట, మే 1: మండల కేంద్రానికి చెందిన రాజేష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాం మోహన్ తెలిపారు. రాజేష్ కోళ్ళఫారంలో తమ పిల్లలైన ముగ్గురు బాల కార్మికులతో కోళ్ళదాన మోయించాడని వారి తల్లి రేణుక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ రాంమోహన్ వెల్లడించారు. కోళ్ళఫారం యజమాని చిన్న పిల్లలని చూడకుండా బరువైన పనిచేయించాడని రేణుక ఫిర్యాదులో పేర్కొన్నారు. కోళ్ళఫారం యజమాని రాజేష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్టు

కోనరావుపేట, మే 1: ఎలాంటి పత్రాలు లేని భూమిని మోసం చేసి రిజిస్టర్ చేసిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ పంపినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ బుధవారం తెలిపారు. ఎస్పీ మహాజన్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామానికి చెందిన కొంపెల్లి విజయకు ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామానికి చెందిన మంత్రి రఘు తనకు కోనరావుపేట మండలంలో భూమి ఉన్నదని మోసం చేసి విజయ వద్ద 20 లక్షల రూపాయలు తీసుకొని లేని భూమిని కబ్జాలో ఉన్నట్టుగా విక్రయించాడు. అట్టి భూమిని హద్దులు చూపించాలని విజయ కోరగా మరో లక్ష రూపాయలు ఇస్తేనే హద్దులు చూపిస్తానని అన్నారు. నేను మాజీ నక్సలైట్‌ను అని చంపేస్తానని బెదిరించాడని కోనరావుపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. మంత్రి రఘు చేతిలో మోసపోయిన వ్యక్తులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని అన్నారు.

సంక్షిప్త సమాచారం..

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో డిప్యూటీ పారామెడికల్ అధికారిగా సుదీర్ఘకాలంగా సేవలు అందించిన రేవూరి కాశీనాథ్ ఉద్యోగ పదవీ విరమణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం సిరిసిల్లలోని వాసవీ కళ్యాణ మండపంలో నిర్వహించిన పదవీ విరమణ సందర్భంగా రేవూరి కాశీనాథ్ దంపతులను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలోని ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, డిప్యూటీ వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, డాక్టర్ మురళీధర్‌రావు, డాక్టర్ నయూమా పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేటలోని పురాతన రామాలయంలోని శ్రీ సీతారామస్వామిని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బుధవారం దర్శించుకున్నారు. గంభీరావుపేటకు చెందిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు శ్రీ సీతారామస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, నాయకులు బాలకిషన్‌రావు తదితరులు ఉన్నారు.

రుద్రంగి: ఎస్సీ వర్గీకరణ అమలు బీజేపీతోనే సాధ్యమవుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగం దుల బిక్షపతి మాదిగ అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బీజేపీకి మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం బీజేపీతోనే సాధ్యమవుతుందని, కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రుద్రంగి మండల అధ్యక్షుడు బడుగు సంజీవ్ మాదిగ, ఉపాధ్యక్షులు దయ్యాల నారాయణ మాదిగ కోనరావుపేట మండల అధ్యక్షులు కలకోట రవి మాదిగ పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని జోగాపూర్ గ్రామ శివారు గుడిపేటలో పోచమ్మ బోనాలను గ్రామస్థుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి నుండి మహిళలు బోనంతో డప్పు చప్పులతో నృత్యలు చేస్తూ తరలివచ్చి అమ్మవారికి నైవేధ్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, కుల సంఘం నాయకలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల క్రైం: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గడ్డం రాహుల్‌పై ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద పల్లపు వంశీ అనే యువకుడు బీరు సీసాతో హత్యాప్రయత్నం చేశాడని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు. బుధవారం పట్టణంలోని చేనేత చౌక్ సమీపంలో గల బార్‌అండ్ రెస్టారెంట్ వద్ద ఉనన రాహుల్‌పై పాత గొడవలు దృష్టిలో పెట్టుకొని వంశీ బీరుసీసాతో తలపై కొట్టి వీపులో పొడిచాడని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రాహుల్‌ను ఆస్పత్రికి తరలించామని ఆయన తెలిపారు.

వేములవాడ రూరల్: మాటామాట పెరిగి ఘర్షణ జరిగి ఇద్దరు గాయాలపాలైన సంఘటన మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నూకలమర్రి గ్రామానికి చెందిన రాజు, అజయ్‌ల మధ్య ఎరువు విషయంలో ఒకరినొకరు ధూషించుకొన్నారు. వారి మధ్య మాటా మాటా పెరిగి గొడవ ఘర్షణకు దారి తీసింది దీంతో ఒకరినొకరు దాడి చేసుకున్నారు. ఇరువురికి గాయాలు కావడంతో కుటుంభసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు తెలిపారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్మిక విభాగం, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్ఎస్ కార్మిక విభాగం వివిధ పార్టీల అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను జరుపుకున్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాల్లో భాగంగా జరిగిన ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రసంగించారు. సిరిసిల్ల, వేములవాడ, బోయినపల్లి, చందుర్తి, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, గంభీరావుపేట వీర్నపల్లి తదితర మండలాల్లో ఎర్రజెండాలను ఎగురవేశారు. సిరిసిల్లలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

వేములవాడ: పట్టణంలో సీఐటీయూ మున్సిపల్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం అశోక్ పతాకాన్ని ఎగరవేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, వైస్‌చైర్మన్ బింగి మహేష్, సీఐటీయూ నాయకులు ఎగుమంటి ఎల్లారెడ్డి, ముక్తికాంతం అశోక్, ఎర్రవెల్లి నాగరాజు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంతో పాటు కార్మికు వాడలైన బీవైనగర్, రాజీవ్‌నగర్, వెంకంపేట చౌరస్తాల వద్ద ఏఐటీయూసీ జెండాలను సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెండాను సంఘం నాయకుడు దేవయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, సీపీఎం, సీఐటీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు కూరపాటి రమేష్, మూషం రమేష్, కోడం రమణ, కార్మికులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలో ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం నుంచి అరుణోదయ కళాకారుల ఆటపాటలతో పట్టణ ప్రధాన రహదారుల గుండా శాంతినగర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. శాంతినగర్ చౌరస్తాలో ఏఐఎఫ్‌టీయూ (న్యూ) జెండాను రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటి సభ్యులు సోమిశెట్టి దశరథం, ఉల్లాల కిషోర్, కార్మికులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలో బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక లేబర్ అడ్డా వద్ద బీఆర్‌టీయూ జెండాను జిల్లా అధ్యక్షుడు వెంగల శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర కార్యదర్శి గూడురి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.

● సిరిసిల్ల ఆర్టీసీ డిపో కార్మికుల ఆధ్వర్యంలో సిరిసిల్ల ఆర్టీసీ డిపో సీనియర్ కార్మికుడు జేఆర్‌జీ రావు ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్టీసీ కార్మికులు గొట్టె శంకర్, గర్దాస్ శ్రీనివాస్, ఈయూ డిపో కమిటి అధ్యక్షుడు బాణయ్య పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: ప్రపంచ కార్మిక దినోత్సవంను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, నాయకులు కూనబోయిన బాలరాజు, వరుకోలు మల్లయ్య, బడుగు లింగం, లింగంపల్లి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం, హమాలీ సంఘం, పారిశుధ్య కార్మిక సంఘం, పేయింటింగ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ జడ్పీటీసీ మల్లుగారి నర్సాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి. కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: కష్టజీవులుగా పనిచేస్తున్న కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తున్న వారిని ఎన్నికల్లో ఓడిస్తామని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో అన్ని వర్గాల కార్మికులు కలిసి మే డే నిర్వహించారు. కార్మికులు ర్యాలీ నిర్వహించి, సీఐటీయూ కార్మిక సంఘం అధ్యక్షుడు అన్నారం రాజేశం ఆధ్వర్యంలో సీఐటీయూ జెండాను ఎగరవేశా రు. కార్యక్రమంలో జడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ప్రజాసంఘాల నాయకుడు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: అర్బన్ పరిధిలోని చంద్రంపేట, రగుడు, పెద్దూర్, చిన్నబోనాల, సర్దాపూర్, పెద్దబోనాల, రాజీవ్‌నగర్ గ్రామాల్లో మరమగ్గాల కార్మిక సంఘాలతో పాటు వ్యవసాయ రైతు కూలీ సంఘాల అధ్వర్యంలో మేడే సందర్భంగా కార్మిక జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు పోచవేని సత్యఎల్లయ్య, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మి, బొల్గం నాగరాజుగౌడ్, బుర్ర లక్ష్మీశంకరయ్య, కల్లూరి లతమధు, చెన్నమనేని కీర్తి, భూక్య రెడ్డినాయక్, లింగంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లో సీపీఎం పార్టీ కార్యాలయం ఎదుట మే డే సందర్భం గా సీపీఎం పతాకాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు ఆవిష్కరించారు. సీపీఎం జిల్లాకార్యదర్శి మూషం రమేష్, సీనియర్ నాయకులు మిట్టపల్లి రాజమల్లు, సూరం పద్మ, లక్ష్మి, కల్పన, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సిరిమల్ల సత్యం, ఉడుత రవి పాల్గొన్నారు.

● కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీని జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికులు తమ ఓట్లతో ఓడించి బుద్ధి చెప్పాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూర పాటి రమేష్ కోరారు. మే డే సందర్భంగా పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంతోపాటు జిల్లా ప్రభుత్వం అసుపత్రి, చంద్రంపేట, మున్సిపల్ కార్యాలయాల ఎదుట జెండాలను ఎగురవేసి మేడే అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా కార్యదర్శి కోడం రమణ పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతో పాటు, నామాపూర్, పోతుగల్, గూడెం, గూడూరు, ఆవునూర్ తదితర గ్రామాల్లో కార్మికులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు తాటకర్ల ప్రభాకర్, సంఘం అధ్యక్షుడు పల్లూరి కిషన్, గీస బాలనర్సు, పారిశుధ్య సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తంగళ్ళపల్లి: మండల కేంద్రంలో సీఐటీయూ కార్యాలయం ఎదుట, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జెండా అవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, కుడిక్యాల కనకయ్య, తంగళ్లపల్లి ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనె పర్శరాములు పాల్గొన్నారు. రాళ్లపేట, టెక్స్‌టైల్ పార్కు, కస్బెకట్కూరు, మండెపల్లి, జిల్లెల్ల, నేరళ్ల, దేశాయిపల్లె, సారంపల్లి, తంగళ్ళపల్లి, చీర్లవంచ, రామన్నపల్లె, బస్వాపూర్‌లో సీపీఐ, హమాలి సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు సోమ నాగరాజు, హమాలి సంఘం నాయకుడు బాచుపల్లి శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంతో పాటు నిమ్మపల్లి, సుద్దాల గ్రామాల్లో హమాలీ సంఘం సీఐటీయూ జరిగిన వేడుకల్లో జవ్వాజి విమల, ఎగమంటి ఎల్లారెడ్డి, హమాలి సంఘం నాయకులు ఎర్రవెల్లి అశోక్, కాదాసు సుధాకర్ పాల్గొన్నారు.

చందుర్తి: మండల కేంద్రంతో పాటు మూడపల్లి, బండపల్లిలో కార్మిక సంఘం నాయకులు జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్, కార్మిక సంఘం నాయకులు మెంగని రవి, తిప్పని భూమయ్య, శంకర్, నర్సయ్య పాల్గొన్నారు.





మే డే వేడుకల్లో పాల్గొన్న వేములవాడ, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్లు రామతీర్థపు మాధవి, జిందం కళ





వీర్నపల్లిలో మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు, గంభీరావుపేటలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు, కార్మికులు